# సంజయ్ అనుభవం



దొడ్లంకి వెంకట్రావ్

(అంబర్)

ఊరికి చివరిలో ఉంది 'సీనియర్ కాలేజి.'

ఆ కాలేజీలో పన్నెండు వందల సభ్యులతో కూడుకున్న ఒక యూనియన్ ఉంది. దాని పేరు– "జోకర్స్ యూనియన్" దానికి నామకరణం చేయటం ఒక పెద్ద ప్రోబ్లమ్ అయి, అందరు సభ్యులూ కాలేజి క్యాంటీన్‌లో సమావేశమై, ఆలోచన చేసి, ఆ ఆలోచనలో మూడు పెట్టెల సిగరెట్లు తగలేసి, ఏకగ్రీవంగా ఒక అభిప్రాయానికి వచ్చి, 'జోకర్స్ యూనియన్' అని పేరు పెట్టుకున్నందుకు ఆ రోజు కాలేజీ ఎగ్గొట్టవలసి వచ్చింది. నామకరణ దినోత్సవ సందర్భంలోనే అందరూ సంజయ్‌ని ఆ యూనియన్‌కి ప్రెసిడెంటుని చేసి, టీ పార్టీ చేసుకొని, సంజయ్ జేబు ఖాళీ చేయించేశారు. జేబులో ఒక్క పైసా కూడా లేదనే బాధ తప్ప, పార్టీ కోసం ఖర్చు పెట్టాల్సి వచ్చినందు కేమాత్రమూ బాధ పడలేదు సరికదా తను ప్రెసిడెంటు అయినందుకు మరీ పొంగి పోయాడు.

ఆ యూనియన్ వాళ్ళు వేసే జోక్స్‌కు, ప్రదర్శించే వెకిలి చేష్టలకు కాలేజీమొత్తం పగలబడి నవ్వాల్సిందే. లెక్చరర్లు చివరికి ప్రిన్సిపాల్ కూడా వాళ్ళ చేష్టలకి బయటికి చిన్నగా చిరుబుర్రు లాడినా (వారి డిగ్నిటీకి లోపం ఏర్పడకూడదని), లోలోపల మాత్రం నవ్వుకోక తప్పదు.

సంజయ్ పెద్దగా కోటీశ్వరుల బిడ్డ కాకపోయినా డబ్బు విషయంలో మాత్రం లోటు లేదు. తన తల్లి దండ్రులకు తాను ఒక్కడే కొడుకు కావటం మూలంగా కాస్త సరదాగానే రోజులు గడిపేస్తున్నాడు. డబ్బు అడిగితే తండ్రి కళ్ళెర్ర జేసినా, చాటు–మాటుగా తల్లి నోట్లందివ్వటంతో సంజయ్ తల్లి చెంగు పట్టుకొనే తిరుగుతాడు. ఫర్వా లేదు. కాకాకొట్టి తల్లి కన్ను కప్పటంలో మాంచి సిద్ధహస్తుడేం కాకపోయినా, తల్లి వెన్న మనసును ఆసరాగా చేసుకుని, తన అవసరాలు తీర్చుకోగల సమర్థుడు సంజయ్.

'మనీ మేక్స్ మెనీ థింగ్స్' అంటాడు సంజయ్. స్నేహితులకు ఖుష్షులుగా తన చుట్టూ తిప్పించు కోవాలన్నా, కాలేజీ ఎగ్గొట్టి, అటెండెన్సు సర్దుబాటుచేయించు కోవాలన్నా, యూనివర్శిటీకి వెళ్ళి ప్యాసు చేయించుకోవాలనుకున్నా, చివరికి ఆడపిల్లల అందాల్ని అనుభవించాలన్నా డబ్బే కావాలంటాడు. అదే అన్నిటికంటే ముఖ్యమంటాడు. అన్నింటినీ డబ్బుతో బేరీజువేసే మనిషి సంజయ్. అల్లరి చిల్లరిగా తిరగడానికి, ఆడపిల్లలను అల్లరి చేయడానికి, హాయిగా కాలాన్ని ఎంజాయ్ చేయడానికి అనువయింది కాలేజీ లైఫేనని అంటాడు.

రోడ్లన్నీ సర్వేచేసి సంజయ్ ఇల్లు చేరేసరికి సరిగ్గా రాత్రి తొమ్మిదయింది. మధ్య గదిలో నాలుగు కుర్చీల మధ్య టీపాయ్‌మీద ట్రేలో ఉన్న ఖాళీకాఫీ కప్పులు ఎవరో– చుట్టాలో, స్నేహితులో వచ్చి, అప్పటి వరకూ ఉండి, అప్పుడే వెళ్ళిన వార్తని అందిస్తున్నాయి.

సంజయ్ తన గదిలోకెళ్ళి బట్టలు మార్చుకుంటూండడం చూసి, కాఫీ పట్టుకొచ్చింది సంజయ్ తల్లి మహాలక్ష్మమ్మ. ముఖం కడుక్కొని టవల్‌తో తుడుచుకుంటూ గదిలో కొచ్చిన సంజయ్ తల్లి చేతి నుండి కాఫీ కప్పందుకున్నాడు.

"అమ్మా! ఎవరో మనింటికి వచ్చివెళ్ళినట్టున్నారు?" కాఫీ తాగుతూ అడిగాడు.

"ఆఁ...చెప్పటం మరిచాను. కాంతారావుగారని, నాన్నగారికి తెలిసినతనట. అతనికి ట్రాన్సఫరయి, ఈ వూరు వచ్చారట. ఇక్కడ మనమున్నామని తెలిసి, నాన్నగారిని కలిసి పోదామని భార్యా బిడ్డ సమేతంగా వచ్చి వెళ్ళిపోయారు. చాలాసేపు కూచొని, అన్ని విషయాలు మాట్లాడారు. నువ్వు బి.ఏ. చదువుతున్నావని చెప్తే ఎంత మురిసి పోయారనుకున్నావ్!..." బట్టలు బీరువానుండి తీసి, వేసుకుంటూ అంతా వింటున్నాడు సంజయ్.

"వాళ్ళమ్మాయి ఎంత బాగుందను కున్నావ్ ?..." 'అమ్మాయి' అనేసరికి ముఖం పైకెత్తి చూశాడు. తల్లి అను మానిస్తాదని మళ్ళీ దించేసుకున్నాడు.

"...పేరు నళినియట" ఎంత బాగుంది అనుకున్నాడు.

"...వాళ్ళకి పిల్లలు లేకపోతే నళినిని దత్తత చేసుకున్నారట. గుండ్రని ముఖం, పెద్దకళ్ళు, నవ్వితే సొట్టలుపడే బుగ్గలు,. చాలా అందంగా ఉందిరా!..." చెవులు నిక్కించి వింటున్న సంజయ్ అంతలోనే కలలు కనటం ప్రారంభించాడు.

"...వెళిపోతూ వాళ్ళింటి అడ్రసు యిచ్చారు. మీకాలేజీకి వాళ్ళిల్లు దగ్గరేనుట. ఎవ్వొకసారి వాళ్ళింటికి రమ్మని మరీ-మరీ చెప్పారు" అంటూ జాగ్రత్తగా బుక్-షెల్ఫ్‌లో దాచి వుంచిన అడ్రస్ కాగితం తీసి సంజయ్ కిచ్చింది. అమాంతంగా ఆతురతగా అందుకోబోయి సంజయ్ చిత్తు కాగితం ముక్కను చూస్తున్నట్టుగా నటిస్తూ అందుకున్నాడు. వంటగదివైపు మహాలక్ష్మమ్మ వెళ్ళిపోవటంతో అడ్రస్ కాగితాన్ని పదిలంగా చేతులలోకి తీసుకొని ముద్దులు కురిపించేశాడు. అంతలోనే నళినిని ముద్దు పెట్టుకున్నట్టు ఫీలయిపోయి, అప్పటి కప్పుడే వాళ్ళింటి కెళిపోవాలను కున్నాడు. కాని, ఎందుకో బాగుండదనుకొని ఆగిపోయాడు.

పన్నెండు దాటి ఒంటి గంటవుతున్నా పక్కమీద దొర్లుతున్న సంజయ్‌కి నిద్ర రావటం లేదు నళినీ ఊహలలో విందుకొని ఊరిస్తుంది. తల్లి వర్ణించిన నళినీ రూపాన్ని పదింతలుగా మెరుగులు దిద్దుకొని ఊహాలోకంలో ఊరేగిపోతున్నాడు.


మనిషి గొప్ప బలహీనుడు. కష్ట మొచ్చినా భరించలేడు, సుఖ మొచ్చినా భరించలేడు. రెండింటినీ సమానంగా భరించగలిగితే... ఇంకేం?... మహాత్ముడై పోగలడు.

సంజయ్ మెల్లగా నిద్రలోకి జారిపోయే సరికి సరిగ్గా రెండయింది.

*   *   *

ఒకే రంగుపాంటు, షర్టు టక్ చేసు కొని, రెండంగుళాల దళసరితో ముఖానికి పౌడర్ అద్దుకొని, ఒకటి రెండుసార్లు అద్దంముందు నిలబడి చూసుకున్నాడు. తన ఆకారాన్ని. అక్కడక్కడా పౌడరు ఒత్తుగా కన్పిస్తే రుమాలుతో కవర్ చేశాడు. ఎంత ప్రయత్నించినా షేవింగ్ చేసుకుంటున్నప్పుడు గడ్డం దగ్గర తెగిపోయిన మచ్చ మాత్రం పోలేదు. అద్దంలోలా ప్రతిబింబం కన్పించే టట్టుగా పాలిష్ చేయబడిన బూట్లు తళుక్కు మంటున్నాయి. చేతినున్న వీకో వాచి చూసుకున్నాడు. టైం తొమ్మిది అయింది వంటింట్లో వున్న తల్లికి తాను వెళుతున్నట్టు కేకేసి, కాంపౌండ్ గేటుదాటి రోడ్డు మీదకి స్కూటర్‌ని పోనిచ్చాడు.

అడ్రస్ ప్రకారం ఇల్లు దొరికింది ఇల్లు




కాస్త చిన్నదైనా, పూలమొక్కలతోటి, ఇంటి ముందున్న సన్నజాజుల పందిరితోటి ఎంతో అందాన్ని సంతరించుకొంది.

"పందిరి క్రింద అమ్మాయి ఎవరు చెప్మా!... బాబ్డ్‌హెయిర్, గుండ్రనికళ్ళు, సొట్టలు పడుతున్న బుగ్గలు, చక్కని పళ్ళ వరుస, చేతుల్లేని జాకెట్టు, సన్నని ఉల్లి పొరలాంటి చీర వెనక నుండి కనిపించే అందాల పొంగులు... ఓహ్! ఏపిల్ పండు లాగుందా అమ్మాయి... తప్పకుండా నళినే అయ్యుంటుంది..."

"ఎవరు కావాలండి ?"

ఆమె అందాన్ని తనివితీరా చూస్తున్న సంజయ్ ఆమె వేసిన ప్రశ్నను వినిపించు కోనే లేదు.

"మిమ్మల్నేనండీ! ఏమిటలా చూస్తు న్నారు ?"

తుళ్ళిపడి తేరుకున్నాడు

"నేనండి...నేను.. మీరు...మీనాన్నగారు ...కాంతారావుగారు కదండీ..."

తడబడుతున్న సంజయ్‌ని చూసి గొల్లు మని నవ్వింది. సంజయ్ సిగ్గుపడి పోయాడు

"రండి లోపలికి" అంటూ లోనికి ఒయ్యారంగా దారి తీసిన నళినిని అనుస రించాడు సంజయ్. తనను తాను సంభా ళించుకొనే ప్రయత్నం చేసుకుంటున్నాడు నెమ్మదిగా.

"కూచోండి!" కుర్చీ చూపించింది. "ఇప్పుడే వస్తాను" అంటూ లోనికెళ్ళి పోయిన నళిని రెండు నిముషాల్లో కాఫీ కప్పుతో వచ్చింది

"మీ పేరు నళిని కదండి!" ధైర్యంగా అడిగేశాడు.

"అవును మీకెలా తెలుసు ?" కాఫీ అందించింది.

సంజయ్ గేరు మార్చాడు. "నాకు తెలియకపోవడమేమిటి మీ నాన్నగారు, మా నాన్నగారు ఫ్రెండ్స్ చిన్నప్పుడు మీరు నేనూ ఆడుకొన్న ఆటలు గుర్తు రాలే? నేను...సంజయ్‌ని అప్పుడే ఎంత దానివయి పోయావ్. ఇసుకలో పిచ్చుక గూళ్ళు కట్టు కొని, లక్కపిడతలతో, బొమ్మలతో ఆడుకునే వాళ్ళం కదూ! ఏదయినా మనం ఇద్దరం సగం-సగం పంచుకొనేవారం ఆకస్మాత్తుగా మీ నాన్నగారికి ట్రాన్స

వారయి తువ్వూరినుండి వెళ్ళిపోవటంతో మనం విడిపోయాం. అప్పుడు నేను ఎంత బాధపడ్డా ననుకున్నావ్?"

కళ్ళు పెద్దవి చేసుకొని, సంజయ్‌ని, అతని, ముఖ కవళికల్ని పరిశీలిస్తూ, అతని మాటలు వింటూ, ఆశ్చర్యంగా అలాగే చూస్తూ ఉండిపోయింది నళిని. ఏకాదంగా పెరిగిన పెద్ద జుత్తు, బొద్దు మీసాలు, పెద్ద కళ్ళద్దాలు, బెల్‌ఫాంటు... ఆ జోకర్ ఆకారాన్ని చూసి ఒకవైపు నవ్వొస్తుంది ఆమెకు.

"అలాగా అప్పుడు చిన్నదాన్నయి ఉంటాను. అందుకే సరిగ్గా గుర్తు రావటం లేదు...కాఫీ తీసుకోండి. చల్లారి పోతుంది"

"ఓ! తప్పకుండా..." అని సిప్ చేయబోయి, ఆగి తనను వింతగా చూస్తున్న నళినిని చూశాడు.

"ఆగిపోయారేం?" అడిగింది.

"మరి, మీకో కాఫీ..." అంటూ సాసరులోకి ఒలకబోశాడు కాఫీని.

"అబ్బే, ఇప్పుడే నేను తాగానండి..."

"ఫర్వాలేదు, తీస్కోండి ... ఒక్కణ్ణే అంతా తాగేయటం నాకిష్టంగా ఉండదు."

సాసరుసందుకొని తాగేసింది నళిని. ఖాళీ కప్పు టీపాయ్ మీదుంచాడు సంజయ్.

"మీ అమ్మగారు, నాన్నగారు..."

"ఇద్దరూ కలిపి మార్నింగ్ షోకి వెళ్ళారు. నేను ఒంటరిగా ఉండని చెప్పి ఉండిపోయాను."

"అబ్బ...ఎంత గొప్ప అవకాశం?" అనుకున్నాడు.

రెప్ప వాల్చకుండా సంజయ్‌నే అలా చూస్తున్న నళినిని చూసి సంజయ్ కొంచెం ఇబ్బందిఫీలయినా, ఆ చూపుల్లో కురుస్తున్న అమృత వర్షానికి ఆనంద భరితుడైపోయి, తనూ అలాగే చూస్తూ కూచున్నాడు. క్షణం ఒకరి నొకరు చూసుకుంటూ మౌనంగా ఉండిపోయారిద్దరూ.

"ఏమండీ!...ఏమిటలా చూస్తున్నారు" అడగాలనే అడిగాడు.

"ఎలా చూస్తున్నాను?" చూపులు మరల్చకుండానే అడిగింది.

"అదోలా..."

"అంటే?..."

"అంటే... నళినిని చూస్తున్న అనార్కలిలా, షాజహాన్‌ని చూస్తున్నముంతాజ్‌లా మజ్నూను చూస్తున్న లైలాలా, దేవదాసుని చూస్తున్న పార్వతిలా..." కవిత్వం చెప్పటం ప్రారంభించాడు.

"ఇంకా..." చెప్పు గొడుతున్నట్టుగా అంది.

"ఇంకా..." లేచి నిలబడ్డాడు, "ఇంకా ప్రేమకు ప్రతి రూపంగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రియుని ముందు ప్రేయసిలా..." నళిని చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ, ఊపిరి తీస్తూ, విడుస్తున్నప్పుడు ఎగిసి పడుతున్న నళిని ఎదపుల్ని చూస్తూ ఒక్కొక్క డైలాగు చెప్తున్నాడు.

"ఇంకా..."

"నళినీ!..!" మెల్లిగా పిలిచాడు.

"ఊం..." కళ్ళు మూసుకొని 'ఊ' కొట్టింది.

ఇక అభ్యంతరం లేదనుకొని, గట్టిగా కౌగిలించుకొని, పెదవులను ముద్దెట్టుకున్నాడు. ఆ ముద్దులో, ఆ కౌగిలింతలో ఎంతో ఆనందాన్ని, అనుభూతిని పొందుతున్నాడు.

తల్లి మహాలక్ష్మమ్మ కేకతో తలగడ దిండును గుండెల కద్దుకుంటున్న సంజయ్ ఉలిక్కిపడి లేచాడు. గడియారం వరుసగా ఎనిమిది గంటలు కొట్టింది. తన తీయటి కలని, ఆ కలలోని మధురానుభూతిని నెమరవేసుకుంటూ మంచం దిగాడు.

స్నానం–పానం గంటలో ముగించేసుకుని ట్రిమ్‌గా టాయిలెట్ అయి, స్కూటరు తీసుకొని బయల్దేరాడు అడ్రసు ప్రకారం ఇల్లు దొరికింది కాని కలలోలా చిన్నదేం కాదు, పెద్ద బంగళా, చుట్టూ రక–రకాల పూల మొక్కలతో అందమయిన గార్డెన్. ఇంటి ముందు సన్నజాజుల పందిరగాని, పందిరి క్రింద అందాల నళినిగాని కనిపించ లేదు సంజయ్‌కి.

నళినికి బదులు కాంతారావుగారు ఎదురొచ్చారు,

"ఎవరు బాబూ?"

కాంతారావుగారు ముసలితనేమీ కాదు. దగ్గర–దగ్గర వలభై సంవత్సరాల వయసు ఉంటుంది. అతన్ని చూడగానే నమస్కరించాడు వినయ పూర్వకంగా.

"నేను రంగారావు గారబ్బాయినండి, పేరు సంజయ్."

"ఓహో! నువ్వేనా దానోయ్‌రా!" అంటూ లోనికి తీసుకెళ్ళాడు. ఒసేవ్ ఇదిగో! ఇలా రావే! రంగారావుగారబ్బాయి సంజయ్ వచ్చాడు." అంటు పెళ్ళాన్ని కేకేసి, సంజయ్‌కి సోఫా చూపించాడు.

చుట్టూ ఆశగా చూశాడు సంజయ్– నళిని కనిపిస్తుందేమోనని. ఎక్కడా కనిపించ లేదు. కాంతారావుగారు ఏవేవో కబుర్లు చెబుతుంటే అనాలోచితంగా వింటూ కూచున్నాడు. కాఫీలు పట్టుకుని కాంతారావు గారి భార్య వచ్చింది.

"ఇదిగో! ఇతడే సంజయ్..." అంటూ పరిచయం చేశారు కాంతారావుగారు.

"నమస్కారమండీ!" వినయాన్ని నటనా పూర్వకంగా ప్రదర్శించాడు.

"నమస్కారం. కాఫీ తీసుకో బాబు!"

'నళిని చేత కాఫీ పంపలేదేమిటా, ఈవిడ మోసుకొచ్చింది' లోలోపల తిట్టుకుంటూ కాఫీ అందుకున్నాడు.

సరిగ్గా గంటన్నర గడచిపోయింది. ఏదీ, నళిని కన్పించదేం? ఇంక ఓపిక నశించి పోయింది సంజయ్‌కి.

"కాంతారావుగారు! నేనొచ్చి చాలా సేపయింది. ఇక వస్తానండి" అంటూ లేచాడు. "అన్నట్టు మా అమ్మగారు నళినీ గురించి చాలా చెప్పారు" నళినిని పరిచయం చేయటం మరచిపోయారని గుర్తు చేస్తున్నట్టు అన్నాడు.

"ఓహో! మరిచే పోయాను...అమ్మా! అమ్మాయి నిలా పిలువు!..."

సంజయ్‌కి చాలా ఆనందమైపోయింది.

అలాగే గుండె స్పందనా వేగం హెచ్చింది. నళిని అందాన్ని, అవయవ సొంపుల్ని స్మరించుకుంటూ ద్వారం వేపు చూడ సాగాడు. ఆత్రుత...నళినిని ఎంత వేగం చూస్తానా అన్న ఆత్రుత సంజయ్‌లో విపరీతమయింది.

కాంతారావుగారి భార్య, ఆవిడ వెనకాలే నాజూగ్గా వదుపుకుంటూ వస్తున్న నళినిని చూసి సంజయ్ సడన్ షాక్ తిని గస్సుమని గాలిపోయిన సైకిల్ ట్యూబ్‌లా అయిపోయాడు. కళ్ళు కన్పించనంత కటిక చీకటి

సంజయ్ చుట్టూ క్రమ్మేసినట్టనిపించింది; మెల్లగా తేరుకున్నాడు.

అమ్మ చెప్పినదానికన్నా నాలుగింతలు అందంగా ఉంది వశిని. గుండ్రని ముఖం, బాబ్డ్ హెయిర్, చక్రాల్లాంటి కళ్ళు, చక్కని నవ్వు... ఓహ్... పువ్వుల-పువ్వుల గౌనులో వశిని ఎంతో చెప్పలేనంత అందంగా ఉంది.

చటుక్కున ఎత్తుకొని ముద్దు పెట్టుకున్నాడు సంజయ్. ●


# మీ పళ్ళను మూడు విధాలుగానూ రక్షించుకునేందుకు కొత్త కోల్గేట్ ట్రైగార్డ్ టూత్‌బ్రష్‌లు

దంతపరిశోధనల ఫలితంగా తేలిన టూత్ బ్రష్ ఎలా ఉండాలంటే...



**1 పళ్ళ ఎనామిల్‌ని కాపాడాలి**
ఆహార పదార్థాల రసాయన చర్య, ఆమ్ల ఉత్పన్న నుండి పళ్ళ ఎనామిల్ కాపాడుతుంది. ఆ ఎనామిల్ యొక్క ఉపరితలాన్ని కోల్గేట్ ట్రైగార్డ్ టూత్‌బ్రష్ శుభ్రపరుస్తుంది... పాడయిపోకుండా

**2 పళ్ళ పొర బారినుండి రక్షించాలి**
పళ్ళ పొర దంతక్షయానికి, చిగుళ్ళవ్యాధులకు కారణీభూతమవుతుంది. సరియైన రీతిలో రూపొందించబడిన కోల్గేట్ ట్రైగార్డ్ టూత్‌బ్రష్‌ల కొసలు పొరను పూర్తిగా తొలగించేందుకు తోడ్పడతాయి.

**3 చిగుళ్ళను సురక్షితంగా ఉంచాలి**
చిగుళ్ళు ఆరోగ్యంగా ఉండాలంటే వాటిని మృదువుగా తోముతూ ఉండాలి, తోముతున్నప్పుడు ఇట్టే వెనక్కి వాలిపోయే కోల్గేట్ ట్రైగార్డ్ టూత్‌బ్రష్ కొసలు చిగుళ్ళను చీల్చివేయకుండా తోముతాయి.




మీ కుటుంబంలోని ప్రతివారికి అనువైన 8 రకాలల్లో

# కోల్గేట్ ట్రైగార్డ్

**మూడువిధాలుగానూ మీ పళ్ళను కాపాడేందుకు ప్రత్యేకంగా రూపొందించబడినవి**

CTB G 16 TL